క్లుప్తంగా

సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి



విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్రీకాంత్

మునగపాక: గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ వ్యాపారవేత్త ఆడారి శ్రీకాంత్ కోరారు. మునగపాకలో శనివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి గాలి పటాల పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ యువకులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఆడారి అప్పారావు(మురుగుల) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకట సత్యనారాయణ, గౌరీయూత్ అసోసియేషన్ ప్రోత్సాహంతో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశుని రథయాత్ర



పురవీధుల్లో వేంకటేశుని రథయాత్ర

మునగపాక : ధనుర్మాసంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి రథయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గవర్ల అనకాపల్లి, సిరసపల్లి, నారాయుడుపాలెం, తోటాడ, మూలపేట గ్రామాల్లో ఈ రథయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, భక్తులు పాలమరశెట్టి జగ్గారావు, జేకే నాయుడు, కొమ్మోజు గణేష్, వీఆర్వో నాగేంద్ర, నక్కా మల్లేశ్వరరావు, మద్దాల కృష్ణ, పాలమరశెట్టి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పల్లకి సేవ



పల్లకి సేవలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు

కోటవురట్ల : కైలాసపట్నంలోని రామాలయంలో ధనుర్మాస ముగింపు కార్యక్రమాన్ని గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామునే ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పల్లకిసేవలో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో సీతారాముల పల్లకిని ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీవీ యువసేన గౌరవ అధ్యక్షుడు డీబీవీ రాజగోపాలరాజు, మాజీ సర్పంచు సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, పెన్నాడ రాంబాబు, మేలుకొలుపు బృందం కె.రమేష్, కె.కె.స్వామి, అప్పికొండ నాగ, మేకల నాని, చామంతుల శ్రీనివాసు, కోలాటం తప్పెటగుళ్ల బృందాలు పాల్గొన్నాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ



గవర సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం గవర సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గవర కుల సంక్షేమానికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ గవర్ల సహాయక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కిషోర్, గవర కులస్తులు సూరిశెట్టి రాము, వెలగా సురేష్‌కుమార్, ఆడారి దానకర్ణ, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లె'టూరు'లో పట్టణం

పాడి పంటలు, భోగి మంటలు, పచ్చ తోరణాలు, ముంగిట ముగ్గులు, కళకళలాడే వాకిళ్లు, కొత్త అల్లుళ్లు, కోడి పందాలు.. ప్రతి ఊరూ.. ప్రతి ఇల్లూ ఆనందాల నెలవే..! హిందూ పండగల్లో అత్యంత ముఖ్యమైన పండగ మకర సంక్రాంతి. మన దేశంలోనే కాక.. ప్రపంచ దేశాల్లో ఉన్న భారతీయులంతా ఘనంగా చేసుకునే పండగ సంక్రాంతి. సంక్రాంతి లేదా సంక్రమణము అంటే.. మారడం అని అర్థం. సూర్యుడు మేషాది ద్వాదశ రాశులందు క్రమంగా పూర్వరాశి నుంచి ఉత్తర రాశిలోకి ప్రవేశించడం సంక్రాంతి. తెలుగువారికి పెద్ద పండగ. ఇప్పటికే పట్టణాలన్నీ పల్లెబాట పట్టాయి. ఇన్నాళ్లూ వెలవెలబోయిన గ్రామాలు.. సంక్రాంతి పండగకు ఊరొచ్చిన జనాలతో సందడిగా మారాయి.



పాయకరావుపేటలో రద్దీగా వస్త్ర దుకాణం

- సంక్రాంతి సందర్భంగా గ్రామాలకు సందడి
- పండగ రద్దీతో మార్కెట్లు కిటకిట
- టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

నక్కపల్లి : తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతికి పల్లెలు ముస్తాబయ్యాయి. పొట్ట చేతపట్టుకుని ఎక్కడెక్కడికో వలస వెళ్లిన పల్లె జనం.. తమ సొంత గూళ్లకు చేరుకున్నారు. దీంతో ఊళ్లన్నీ సంబరాల వేదికలయ్యాయి. భోగి మంటల వెలుగు తమ జీవితాల్లో కూడా నిరంతరం నిలివాలని కోరుకుంటూ పెద్దల పండగకు ఏర్పాట్లు చేసుకున్నారు. సంక్రాంతినాడు పితృ దేవతలకు తర్పణాలివ్వడం ఆనవాయితీ. అలా చేస్తే వారు ఏ లోకాన ఉన్నా.. తమను దీవిస్తారని నమ్మకం. అందుకే ఎన్ని పనులున్నా.. ఏడాదంతా తీరిక లేకున్నా.. పండగ రోజుల్లో మాత్రం తమ సొంత ఊరికి చేరుకోవడానికే ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారు.

మార్కెట్‌కు సంక్రాంతి శోభ

మార్కెట్‌కు సంక్రాంతి కళ వచ్చింది. భోగి సందర్భంగా పాయకరావుపేట, తుని ప్రాంతాలు రద్దీగా మారాయి. శనివారం కొనుగోలుదారులతో పాయకరావుపేట, తుని మెయిన్‌రోడ్డు మార్కెట్‌లు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు, ఫర్నిచర్, కిరాణా దుకాణాలు విపరీతమైన రద్దీగా మారాయి. వ్యాపారులు కూడా పలు ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు, యువతతో మార్కెట్ సందడిగా మారింది. పండగ సీజన్ దృష్టిలో ఉంచుకుని మెయిన్‌రోడ్డులో ఇరువైపులా ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన రెడీమెడ్ దుస్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటికి తోడు పట్టణాల్లో మాదిరిగా భారీ వస్త్ర దుకాణాలనుకూడా ఏర్పాటు చేయడంతో అన్ని దుకాణాల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు.

ధరలు పెరిగినా..

గత ఏడాది కంటే రెట్టింపు ధరలకు రెడీమేడ్ వస్త్రాలు విక్రయించారు. చిన్న దుస్తుల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. పెద్దవాళ్లతో సమానంగా వేలాది రూపాయలు వెచ్చిస్తే తప్ప పిల్లలకు దుస్తులు కొనుగోలు చేయలేని పరిస్థితి. పెద్దల దుస్తుల కంటే చిన్నపిల్లల దుస్తులు ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నట్టు వ్యాపారులు చెప్పన్నారు. స్వీటు షాపులు, పూలదుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల కంటే పండగ సందర్భంగా ప్రత్యేక పిండి వంటలను తయారు చేసి, స్వీట్ స్టాళ్ల యజమానులు కొనుగోలుదారుల్ని ఆకట్టుకున్నారు. సంక్రాంతి పండగ కావడంతో అరిసెలు, బొబ్బట్లు, బూరెలు, సున్నుండలు తదితర పిండి వంటలకు గిరాకీ ఏర్పడింది.

కిక్కిరిసిన రైళ్లు, బస్సులు

పాయకరావుపేట, తుని ప్రాంతాలకు చెందిన వారిలో అత్యధికులు రాష్ట్ర నలుమూలల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా ఉంటున్నారు. శనివారం వీరంతా గోదావరి, విశాఖ, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్ రైళ్లు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సుల్ని ఆశ్రయించి, తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు చేరుకున్నారు. రిజర్వేషన్లు దొరక్కపోయినా.. కూర్చునేందుకు వీల్లేకపోయినా.. వెనుకాడలేదు. పాయకరావుపేట, తుని పట్టణాలనుంచి గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు, వ్యాన్‌లను ఆశ్రయించడంతో వాటికి కూడా డిమాండ్ పెరిగింది. కిక్కిరిసిన వాహనాలపై తమ గ్రామాలకు చేరుకునేందుకు వారంతా నానా ఇబ్బందులు పడ్డారు.

టోల్‌గేట్‌ల వద్ద రద్దీ

జాతీయరహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ ఏర్పడింది. విశాఖ నుంచి విజయవాడ, రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. వేంపాడు టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులు తీరాయి. ఫాస్టాగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం వల్ల టోల్‌ఫీజు చెల్లించేందుకు వాహన చోదకులు పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం తప్పింది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా టోల్‌ప్లాజా సిబ్బంది, పోలీసులు చర్యలు చేపట్టారు.

భోగ భాగ్యాల భోగి



అన్న సమారాధన ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక : మండల వ్యాప్తంగా భోగి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రైతులు, యువకులు, పిల్లలు ఇళ్ల నుంచి సందడిగా పొలాలకు వెళ్లి భోగి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మునగపాకలో మేలుకొలుపుల ముగింపులో భాగంగా పల్లపు వీధి వినాయకుని గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనను జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ ప్రారంభించారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేత సూరిశెట్టి కన్నారావు, ఆలయ చైర్మన్ అప్పలనాయుడు, మేలుకొలుపుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వెలగా కుటుంబ సభ్యులంతా ఊరేగింపుగా పొలాలకు వెళ్లి భోగి పండగను ఘనంగా నిర్వహించారు. మునగపాకకు చెందిన పెంటకోట రామమ్మ కళ్లాల వద్ద వనభోజన కార్యక్రమం నిర్వహించారు. తిమ్మరాజుపేటలో భోగి సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో భోగి పండుగను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారు జామున భక్తులు లేచి భోగి స్నానాలు ఆచరించారు. అనంతరం పొలాల్లో భోగి మంటలు వేసుకుని ఆస్వాదించారు. నూతన వస్త్రాలు ధరించారు. మండలంలోని నునపర్తి గ్రామంలో శ్రీ రామ బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గాలి పటాల పోటీలు నిర్వహించారు. రణదీప్ నాయుడుకు మొదటి బహుమతి, యశ్వంత్‌కు ద్వితీయ బహుమతి, భరద్వాజ్‌కు తృతీయ బహుమతి లభించింది. గొంప నరసింహనాయుడు, మాసరపు అప్పారావు, కె.నరసింగరావు, చినబాబు, శ్రీను, గొర్లె అప్పలరాజు, అప్పలనాయుడు, నగేశ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: భోగి పండగను శనివారం ప్రజలు అత్యంత వేడుకగా చేసుకున్నారు. గ్రామాల్లో వీధుల్లో భోగిమంటలు వేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు తమ ఇంట్లో ఉన్న పాత వస్తువులను తెచ్చి భోగిమంటల్లో వేశారు. ఆవు పేడతో చేసిన పిడకలను భోగి మంటల్లోవేస్తూ గ్రామానికి ఎలాంటి అరిష్టాలు చేరకుండా చూడాలని కోరారు. భోగిపండగ సందర్భంగా చుట్టాలు, బంధువులు, కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. పిండి వంటలతో ఘుమఘుమలాడాయి. ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల ఎక్కువగా వచ్చి దర్శనం చేసుకున్నారు. ధనుర్మాసం పూర్తికావడంతో ఆండాళ్లమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే గోదాదేవి కల్యాణాన్ని తిలకించారు. చాలా ఇళ్లల్లో సాయంత్రం చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో లోగిళ్లు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

పాయకరావుపేట : భోగి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ప్రజలు ప్రతి వీధిలోను పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి పండగ చేసుకున్నారు. భోగి పిడకలను మంటల్లో వేసి సంప్రదాయాలను పాటించారు. భోగిమంటల్లో మరిగిన నీటితో పిల్లలు, వృద్ధులు స్నానాలు చేశారు. పండగ సందర్భంగా ముంగిట ముగ్గులను రంగు రంగులతో అలంకరించారు.



భోగి పండగలో పాల్గొన్న రైతులు

కోటవురట్ల : పల్లెలు సంక్రాంతి సంబరాలతో హోరెత్తుతున్నాయి. భోగి పండగను వీధి వీధిన ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా భోగి మంటలు వద్ద సందడి చేశారు. కె.వెంకటాపురంలో గ్రామస్తులంతా కలిసి సంక్రాంతి సంబరాలను జరిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైల రమేష్, సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, ఎంపీటీసీ కాళ్ల రత్నంల ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు హరిదాసు వేషధారణ, సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండల ప్రజలు భోగి వేడుకను శనివారం ఘనంగా చేసుకున్నారు. వేకువ జామునే నిద్ర లేచి నలుగు పిండితో స్నానాలు చేసి భోగి మంటల వద్ద చలిని కాచుకున్నారు. దార్లపూడిలో భారీ భోగి మంట వేసి స్థానికులను ఆకట్టుకున్నారు. సంప్రదాయాల మేరకు చిన్నారులకు వేకుజామున భోగి స్నానం చేయించారు. యువకులు వీధుల్లో భోగి మంటల వద్దకు చేరుకుని సందడి చేశారు.



ఉమ్మలాడలో ముగ్గులను పరిశీలిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్



ఆవు పేడతో చేసిన భోగి పిడకలను భోగిమంటలో వేస్తున్న మహిళలు



పాయకరావుపేటలో భోగి మంటలు



కె.వెంకటాపురంలో సంక్రాంతి సంబరాలు

టీవీ నటి చాందిని మృతి తీరని లోటు



చాందిని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంగస్థల నటుడు జగ్గారావు

మునగపాక: ప్రముఖ డ్యాన్సర్, టీవీ నటి చాందిని మృతి కళారంగానికి తీరని లోటని రంగస్థల నటుడు కాండ్రేగుల జగ్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా మార్టేరు సినీ రికార్డింగ్ డ్యాన్స్ ద్వారా ఎంతోమంది కళాభిమానులను రంజింపజేసిన డ్యాన్సర్ చాందిని సంతాప కార్యక్రమం శనివారం మునగపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీలతో పాటు మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రికార్డింగ్ డ్యాన్స్‌ల ద్వారా అందరి హృదయాలను చాందిని గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో రంగస్థల దర్శకులు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రమణ ఆశయ సాధనకు కృషి



రమణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక: నీతి నిజాయితీలకు మారు పేరుగా స్వర్గీయ పీవీ రమణ ప్రజల మన్ననలు పొందారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీవీ రమణ వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు శనివారం ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన రమణ, పలు పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు బాలకృష్ణ, ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ, టెక్కలి జగ్గారావు, కుటుంబ సభ్యులు పెంటకోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు

రాంబిల్లి: దిమిలిలో వల్లభనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. భోగి పండగ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వార్లకు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణలు పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

కమ్మేసిన పొగమంచు



మంచు గుప్పిట్లో కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: మైదానంలోని రోడ్లపై మంచు కమ్మేసింది. దట్టంగా అలముకున్న పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రహదారిపై దట్టంగా అలుముకోవడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక నానా అవస్థలు పడ్డారు. లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. ఉదయం 10 గంటలైనా పొగమంచు వీడకపోవడంతో సంక్రాంతి పండుగకు ఊర్లు వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

సేవా గుణం అలవరచుకోవాలి



రచ్చబండను ప్రారంభిస్తున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవరచుకోవాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక నందీశ్వర ప్రాంగణం వద్ద ఆడారి అప్పలనరసయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అప్పలనాయుడు, యశోద దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన రచ్చబండను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందీశ్వర ప్రాంగణంలో పలువురు వృద్ధులు తీరిక సమయంలో సేద తీరతారని, అలాంటి వారికి ఈ రచ్చబండ ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ చేతుల మీదుగా దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పెద్దలు దాడి ముసిలినాయుడు, సూరిశెట్టి కన్నారావు, అలంక ప్రకాశరావు, మళ్ల సంజీవరావు, ఆడారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

కోటవురట్ల : కైలాసపట్నంలో వేంచేసి ఉన్న శ్రీ రాజగోపాలస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి, సిద్ధాబత్తుల సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకను తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎక్కిరాల మణికుమారి, ఎంపీడీవో చంద్రశేఖర్, పరిమళ దంపతులు, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : దార్లపూడి కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికి స్థానికులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, వెనుతురపల్లి ధర్మారావు,బాబి సహాయ సహకారాలు అందించారు. ఎస్.రాయవరం వైభవ వేంకటేశ్వర స్వామి, వమ్మవరం స్వయంభూ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు సీతారామ స్వామి ఆలయాల్లో గోదారంగనాయకుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

పాయకరావుపేట : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆయా దేవాలయాల్లో ధనుర్మాస పూజలు, గోదారంగనాయకుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాండురంగ దేవాలయంలో గోదాదేవి కల్యాణం కనుల పండువగా జరిగింది.

సంక్రాంతితో పల్లెలకు శోభ



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: సంక్రాంతి పండగ వస్తే పల్లెలకు కొత్త అందాలు వస్తాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ గ్రామంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీపతిరాజు సమకూర్చిన చీరలు, దుప్పట్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండగకు ప్రతి కుటుంబంలో నూతన ఉత్సాహం కనిపిస్తుందన్నారు. ఈ సమయంలో నిరుపేదలకు వస్త్రాలు సమకూర్చిన శ్రీపతిరాజుని అభినందించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి చంటి, జోగిబాబు, వమ్మరాజు పాల్గొన్నారు.

డ్రైనేజీల పునరుద్ధరణ



కె.వెంకటాపురంలో నిర్మించిన డ్రైనేజీ

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని 6, 8 వార్డుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నోచుకుంది. చాలా కాలంగా డ్రైనేజీలు లేకపోవడంతో స్థానికుల ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్డుపై పారేది. రోడ్లు మురికి కూపాలుగా మారి, దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. దీంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. మురుగునీరు నిలిచిపోకుండా డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. స్థానికులు పారిశుద్ధ్య మెరుగుకు సహకరించాలని, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త వేయకుండా శుభ్రత పాటించాలని కోరారు.









